శాంతినగర్ కోలనీ రిజర్వు స్థలాన్నిపరిరక్షించండి

బిజెపి శ్రీకాకుళం అసెంబ్లీ కన్వీనరు చల్లా వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం కలెక్టరేట్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని, శాంతినగర్ కొలనీకి చెందిన రిజర్వు స్థలాన్ని, కార్పొరేషన్ పరిధిలోని చెత్తను సేకరించే వాహనాలను నిలుపు చేయడానికి ఉపయోగించబోతున్నట్లుగా, కొందరు కోలనీవాసులు అనుమానం వ్యక్తపరుస్తున్నారని, దీనిపై మున్సిపల్ కమిషనర్ వివరణ ఇవ్వాలని బిజెపి శ్రీకాకుళం అసెంబ్లీ కన్వీనరు చల్లా వెంకటేశ్వర రావు కోరారు. ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ డెవలప్‌మెంట్ (లేఅవుట్ మరియు సబ్-డివిజన్) రూల్స్, 2017, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం, 1994 మరియు ఆంధ్రప్రదేశ్ టౌన్ ప్లానింగ్ చట్టం, 1920 ప్రకారం కోలనీ రిజర్వు స్థలాలను కోలనీ వాసుల ఉపయోగం కొరకు మాత్రమే వాడాలని, పార్కులు, దేవాలయాలు, కమ్యూనిటీ భవనాలు, లైబ్రరీ మొదలైన వాటికి మాత్రమే ఉపయోగించాలని తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రెవిన్యూ బోర్డు స్టాండింగ్ ఆర్డర్స్ బీఎస్‌వో 15(4) ప్రకారం రిజర్వు స్థలాలను, విలువైన చెట్లు ఉన్న స్థలాలను వేరే అవసరాలకు వాడరాదని స్పష్టంగా ఉందని తెలిపారు. కోలనీ రిజర్వు స్థలాలను కోలనీ వాసుల కోసం కాకుండా వేరే అవసరాలకు ఉపయోగించరాదని అపెక్స్ కోర్ట్, ఆంధ్ర ప్రదేశ్ హైకోర్ట్, మద్రాస్ హైకోర్టు ఇటీవలే ఇచ్చిన తీర్పులున్నాయని చల్లా వెంకటేశ్వర రావు తెలిపారు. ఈయనతో పాటు శాంతినగర్ కోలనీ సెక్రటరీ పాలవలస రాజశేఖరం, బిఎంఎస్ నాయకులు కోరాడ నారాయణరావు, కోలనీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీకళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో భగవద్గీత పోటీలు

విశాలాంధ్ర-కవిటి : మండల కేంద్రమైన కవిటి శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో భగవద్గీత పోటీలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త కళ్యాణి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత లోళ్ల నారాయణమూర్తి జయంతి ఉత్సవాల్లో భాగంగా భగవద్గీత పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ పాఠశాలల నుండి 18 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జయంతి ఉత్సవాల్లో భాగంగా వివిధ అంశాలలో గెలుపొందిన వారికి బుధవారం ఉదయం 10 గంటలకు కళ్యాణి పాఠశాల వద్ద బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

సలహాదారుల సలహాలతో వైసీపీకి కష్టకాలం..?

విశాలాంధ్ర- పలాస: పలాస నియోజకవర్గం వైసీపీ కేడర్‌లో గందరగోళ పరిస్థితులు నెలకొనే విధంగా తయారయ్యాయి. ఇలాంటి పరిస్థితులు నెలకొనడానికి కొంత మంది సలహాదారులే కారణమవుతున్నారని అపవాదు వినిపిస్తుంది. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు పక్కదారి పట్టించే విధంగా ఆయనను అప్రతిష్ఠ పాల్జేసే విధంగా సలహాదారులు తయారయ్యారని ప్రచారం జరుగుతోంది. వైసీపీ పార్టీ పురోభివృద్ధి లేకుండా ఎదురీదే పరిస్థితులు నెలకొనడానికి ఆయనకు రాజకీయంగా సలహాలు ఇచ్చే వారేనని పార్టీ శ్రేణులు బాహాటంగా అంటున్నారు. వైద్యునిగా ఉంటూ వైసీపీ రాజకీయాల్లోకి 2017లో ప్రవేశించి 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ సీదిరి అప్పలరాజు అనతికాలంలో మంత్రి పదవి అధిరోహించడంలో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి వద్ద రాజకీయ పరిస్థితులు అనుకూలించాయి. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లల్లో జిల్లాలో ఏ నియోజకవర్గం లేని అభివృద్ధి పలాస నియోజకవర్గం కనిపించే విధంగా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రయత్నిస్తుంటే ఎటువంటి రాజకీయ అనుభవం, పరిజ్ఞానం లేని భజన పరులైన సలహాదారుల సలహాలతో నియోజకవర్గంలో వైసీపీ దారి తప్పుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. 2011లో వైసీపీ ఆవిర్భవించిన తరువాత 2019 సంవత్సరం వరకు పార్టీ కోసం పని చేసిన సీనియర్లు, జెండాలు పట్టుకొని తొమ్మిదేళ్లు తిరిగి ప్రత్యర్థి రాజకీయ పార్టీలు అణచివేతకు గురైన కార్యకర్తలు నేడు మంత్రి సలహాదారులతో కనుమరుగయ్యారని, ప్రస్తుతం వీరంతా స్తబ్దతగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు రాజకీయ, తప్పుడు సలహాలు ఇస్తూ కొంత మందిపై లేనిపోని చాడీలు చెప్పి వారిని దూరం చేసి పార్టీని పూర్తిగా భ్రష్టు పట్టించారని కార్యకర్తలు పేర్కొంటున్నారు. భజన పరులైన ఈ సలహాదారులు మంత్రి పేరు చెప్పుకొని చాలా వరకు చేతి వాటం ప్రదర్శిస్తూ రియల్ ఎస్టేట్ దందాలు, సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ సలహాదారులు కోట్లాది రూపాయలు అక్రమంగా ఆర్జించేందుకు విచ్చలవిడిగా అక్రమ వ్యాపారాలు సాగిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. వీరు వైసీపీ పార్టీని నడి సముద్రంలో నట్టేటా ముంచే విధంగా నియోజకవర్గంలో కష్టాలు వచ్చే విధంగా తయారయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో 15 నెలల కాలంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే సూచనలు కనిపిస్తున్నాయని, అప్పటి వరకు సలహాదారులు అడుగులు ఇలాగే కొనసాగితే పార్టీకి గడ్డు పరిస్థితులు దాపురించే అవకాశాలు మెండుగా ఉన్నాయని పార్టీ శ్రేణులే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నాయి. అయితే సలహాదారుల సూచనలను మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అమలు చేస్తున్నారో లేదో అర్థం కాని పరిస్థితి నెలకొన్నా నియోజకవర్గంలో మాత్రం సలహాదారుల చేష్టలు మితిమీరిపోయాయనే ప్రచారం జోరుగా వినిపిస్తుంది. రాబోయే రోజుల్లో వీరిని మంత్రి డాక్టర్ సీదిరి అడ్డుకట్ట వేస్తారో లేదో చూడాల్సి ఉంది.

అలవెన్స్‌లు చెల్లించండి

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: ఏపిపిటిడి (ఆర్టీసి) ఉద్యోగులకు ఈఏడాది అక్టోబర్ 1వ తేదీ నుండి ప్రభుత్వ పిఆర్సీని అమలు చేసినప్పటి నుండి (ఓటి) డ్యూటీలకు చెల్లించాల్సిన అలవెన్సులు, అలాగే నైట్ హాల్ట /డే ఔట్ అలవెన్సులు ట్రాఫిక్, గ్యారేజ్ సిబ్బందికి చెల్లింపులు చేయడం లేదని, అలాగే అనారోగ్యంతో ఏ ఉద్యోగి అయినా సిక్కు సెలవు పెడితే జీతంలో కోతవిధిస్తున్నారని, వీటివలన ఆర్టీసి ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నందున వెంటనే వీటిని చెల్లించాలని విజ్ఞప్తి చేస్తూ ఆర్టీసి మెనేజింగు డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు కి మంగళవారం వినతి పత్రం అందజేసినట్లు ఏపి పిటిడి(ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వై.వి.రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు లు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ అలవెన్సులు ప్రతినెలా ఏ నెలకు ఆనెల జీతంతోపాటు చెల్లిస్తారని ఎంతో ఆశతో ఎదురు చూసిన ఉద్యోగులకు డిసెంబర్ 1 వస్తున్న జీతంతో కూడా కలవడం లేదన్న విషయం తెలుసుకున్న ఆర్టీసి ఉద్యోగులందరు తీవ్రమైన అసంతృప్తికి గురై ఆగ్రహంతో ఉన్నారన్నారు. కావున ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగు పెట్టిన మూడు నెలల ఓవర్ టైమ్/నైట్, డేఔట్ అలవెన్సులు అన్ని అరియర్సుతో సహా సంస్థ వరంగా మేనేజ్ మెంటే సప్లమెంటరీ బిల్లు ద్వారా చెల్లింపులు చేసి ఉద్యోగులలో ఉన్న అభద్రతా భావాన్ని తొలగించి ఆర్థికంగా ఆదుకోవాలని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు.

రాయితీపై పెంపుడు జంతువులు

విశాలాంధ్ర-సోంపేట : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపాధి కల్పించే ఉద్దేశ్యంతో రాయితీ ధరలపై పెంపుడు జంతువులను అందిస్తుందని పలాసపురం సర్పంచ్ తడక జోగారావు పేర్కొన్నారు. వైఎస్సార్ చేయూత కార్యక్రమంలో భాగంగా గ్రామంలో బుధవారం అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. అన్ని వర్గాలవారు ప్రభుత్వం రాయితీపై అందించే ఆవులు, గేదెలు, మేకలు తదితర పెంపుడు జంతువులను సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని కోరారు. వెటర్నరీ అసిస్టెంట్ సునీత, సిఎఫ్ కవిత, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

2న నిరుద్యోగులకు జాబ్‌మేళా

విశాలాంధ్ర-సోంపేట : డిసెంబర్ 2వ తారీఖున సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వెలుగు ఎపిఎం తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియెట్, ఐటిఐ డిప్లోమా కోర్సులు చదివిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎచ్చెర్ల ఎంపీడీవో సస్పెన్షన్ ఉత్తర్వులపై స్టే

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : ఎచ్చెర్ల ఎంపిడిఓ ఎం. పావని సస్పెన్షన్ ఉత్తర్వులపై హైకోర్టు స్టే ఇచ్చిందని ఎంపీపీ న్యాయవాది మొదలవలస చిరంజీవి మంగళవారం తెలిపారు. భవన నిర్మాణ పనుల్లో జాప్యం నిబంధనలకు విరుద్ధంగా వాలంటీర్ల నియామకం, మండల సభ్య సమావేశాల తీర్మానాలను నమోదు చేసుకోవడం, తదితర కారణాలతో ఈ ఏడాది సెప్టెంబర్ 21న ఎంపీడీవోని జడ్పీ సీఈవో సస్పెన్షన్ చేశారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించగా స్టే ఉత్తర్వులు వెలువడ్డాయి.

విపత్తుల రక్షణపై ఐతమ్ విద్యార్థులకు అగ్నిమాపక సిబ్బంది చైతన్యం

విశాలాంధ్ర-టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు టెక్కలి అగ్నిమాపక సిబ్బంది విపత్తులు, ప్రమాద పరిస్థితుల్లో చిక్కుకున్నవారికి ప్రాణరక్షణ చేయుటకు కావలసిన ప్రాథమిక చర్యల గూర్చి వివరించారు. మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహనా సదస్సులో లీడింగ్ ఫైర్మేన్ కె. మధుసూదనరావు, ఫైర్మెన్ కె. రాములు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలిస్తూ ప్రత్యక్షంగా విద్యార్థులు పాల్గొనేలా చేశారు. అగ్ని ప్రమాదం సంభవించినపుడు, తుఫాన్లు, భూకంపాలు వచ్చినపుడు ప్రాణాపాయ స్థితినుండి ప్రమాదంలో చిక్కుకున్న వారికి ఎలా కాపాడాలి అన్న విషయాలను తెలియజేశారు. ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తిలు ఎన్‌ఎస్‌ఎస్ పిఒ డాక్టర్ బి.బలరాం కృషిని అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జీవితంలో ఉపయోగ పడే ఇటువంటి చైతన్య సదస్సులు మరిన్ని నిర్వహించాలని సూచించారు. అధ్యాపకుడు అట్టాడ రాజేష్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

జయదుర్గా భవానీ టాక్సీ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-నరసన్నపేట: పట్టణంలోని జయదుర్గా భవానీ టాక్సీ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం నిర్వహించారు. ఏకగ్రీవంగా జరిగిన ఈ ఎన్నికల్లో యూనియన్ అధ్యక్షులుగా, సుంకాన వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా, కరణం రాజు, కార్యదర్శిగా, ముద్దాడ గోవిందరావు, సహాయ కార్యదర్శిగా, పిలక మురళీ, కోశాధికారిగా చింత సూర్యనారాయణ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను యూనియన్ ప్రతినిధులు పూలమాలలతో సత్కరించారు. యూనియన్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామని యూనియన్ నూతన అధ్యక్షులు, సుంకాన వెంకటరమణ అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పంచాయితీకి 'శీతల శవపెట్టి' వితరణ

విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక మేజర్ పంచాయితీకి మంగళవారం శీతల శవపెట్టిని వితరణగా పంచాయితీ మాజీ వైస్ సర్పంచ్, ప్రస్తుత వార్డ్ మెంబర్, పోట్నూరు కృష్ణప్రసాద్, పోలాకి జెడ్పీటిసి, నియోజకవర్గ వైసిపి యువ నాయకులు, డా.ధర్మాన కృష్ణచైతన్య చేతుల మీదుగా వితరణ చేశారు. అనంతరం కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ తన తండ్రి, దివంగత పోట్నూరు చంద్రభూషణ్ జ్ఞాపకార్థం శీతల శవ పెట్టిని పట్టణంలో మరణించిన వ్యక్తులను దృష్టిలో పెట్టుకొని వితరణ చేయటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయితీ సర్పంచ్, బురల్లి శంకరరావు, వైస్ సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు, సుడా ఛైర్మన్ ప్రతినిధి, కెసిహెచ్‌బి.గుప్తా, వైసిపి నాయకులు, గనగళ్ళ వేంకట శ్రీనివాసరావు, రాజారావు, రమణ సాహు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని దుగాన పుట్టుగ పంచాయతీ పరిధిలో గల ఆనింగిపుట్టుగ గ్రామంలో అయ్యప్ప గురు స్వామి ఆనింగి మాధవరావు నేతృత్వంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి మాల ధరించి 18 ఏళ్లు పూర్తి చేసుకున్న స్వాములు ఈ మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈమేరకు పడిపూజ కార్యక్రమాన్ని శబరిమలైలో అయ్యప్పగుడి వద్ద నిర్వహించేలా ఈ పూజాకార్యక్రమాలను ఘనంగా నిర్వించడం విశేషం. ఇందుకోసం అయ్యప్ప సన్నిధి వద్ద సుమారు 15 అడుగుల ఎత్తులో స్వామివారి 18 మెట్లను తయారుచేసి నిర్వహించే ఈ పడిపూజ కార్యక్రమానికి కేరళకు చెందిన బ్రహ్మశ్రీ ప్రవీణ్ కుమారన్ (పెందుర్తి అయ్యప్ప స్వామి ప్రధాన అర్చకులు) ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలను అద్యంతం భక్తిశ్రద్ధలతో కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో నియోజవర్గం నుంచి వందలాది మంది అయ్యప్ప స్వాములు తో పాటు పూజా కార్యక్రమం తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల్లో నుంచి వందలాది మంది ప్రజలు తిలకించి భక్తి పారవశ్యంలో మునిగారు.

ఆటలతో ఆరోగ్యం, మేధాశక్తి పెరుగుతుంది

వైస్ ఎంపీపీ లోతుగెడ్డ

విశాలాంధ్ర-కొత్తూరు : ఆటలు పోటీలనేవి విద్యార్థుల్లో ఆరోగ్యం తో పాటు వారిలో నిగూఢం గా ఉన్న మేధాశక్తి పెరుగుదలకు దోహద పడతాయని, కొత్తూరు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు అన్నారు. మంగళవారం కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి బాలూరు బాలికల ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఏ రంగంలోనైనా పోటీతత్వం ఉండాలని అప్పుడే గెలుపనేది విజయం సాధించినవారిలో నిజమైన ఆనందం వెల్లి విరుస్తుందఅన్నారు. అనంతరం జరిగిన క్రీడల సభా కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ గోగుల మాధవి, ప్రతినిధి గోగుల వర ప్రసాద్ నాయుడు, హైస్కూల్ కమిటీ చైర్మన్ వడం శ్రీనివాస్, ఎంపీటీసీ గండివలస రత్న కుమారి, ప్రతినిధి గండివలస ఆనంద్‌రావు, హెచ్.ఎం.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు పంపిణీ చేసిన ప్రజాప్రతినిధులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం వడ్డివాడలో జరిగిన మండల స్థాయి పాఠశాల విద్యార్థులు ఆటల పోటీలు గ్రిక్స్‌లో గెలుపుకున్న విజేతలకు సంతబొమ్మాలి మండల జడ్పీటీసి పాలవసంత రెడ్డి, ఎంపీపీ మెరుగు రాజేశ్వరి అప్పారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కెల్లి (గోవింద్) జగన్నాయకులు, మండల సర్పంచుల అధ్యక్షుడు శ్రీరంగం వీరస్వామి చేతులు మీదుగా బహుమతులు మంగళవారం రాత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో వడ్డివాడ సర్పంచ్ గూట్ల మల్లేశ్వరరావు, గోవిందాపురం ఎంపీటీసీ మెండ త్రినాధస్వామి (సాయిరాం), వైయస్సార్ పార్టీ ఇన్చార్జ్ పల్లి రామారావు లాయర్, వడ్డివాడ గ్రామ పెద్దలు, పాఠశాల పీఈటీలు, పాఠశాల హెచ్ఎం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

శివారు గ్రామాలకు అన్ని మౌళిక సదుపాయాలు : సర్పంచ్

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: పంచాయతీ పరిధిలోగల శివారు గ్రామాలకు అన్ని మౌళిక సదుపాయాలు కల్పించటమే ప్రభుత్వ లక్ష్యమని, గత పాలకులు శివారు గ్రామాలకు పట్టించుకొనేవారు కాదని చీపుర్లపాడు పంచాయతీ సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు అప్పలస్వాములు అన్నారు. వీరు మంగళవారం నూతనంగా నిర్మించబోయే డ్రైనేజీ పనులను ప్రారంభించారు. మండలం చీపుర్లపాడు పంచాయతీ పరిధిలో గల శివారు గ్రామమైన దుర్గంపేటకు వీదుల్లో డ్రైనేజీలు లేక మురికినీరు బయటకు వెళ్ళక ఇంటిముందే నిల్వ ఉండి దోమలు, ఈగలతో దుర్గంధం వెదజల్లుతుందని గ్రామస్థులు చాలా సార్లు అప్పటి పంచాయతీ పాలకవర్గాని ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదని, ఇదే విషయం ఈ సర్పంచ్‌కు చెబితే అయన స్పందించి గ్రామంలో అన్ని వీధులకు డ్రైనేజీలను నిర్మించేందుకు నిర్మాణం పనులు ప్రారంభించారని గ్రామస్థులు తెలిపారు. ఈ గ్రామానికి డ్రైనేజీలతో పాటు, త్రాగునీరు, సీసీరోడ్లు తదితర అన్ని మౌళిక సదుపాయాలు కల్పిస్తానని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నెయ్యిల సురేష్, గ్రామస్థులు కాకి షణ్ముఖరావు, తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి గ్రిక్స్ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : మండల స్థాయి గ్రిక్స్ పోటీలు కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు బాలికలకు కబడ్డీ వాలీబాల్ ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంపీపీ మొదలవలస చిరంజీవి ప్రారంభించారు కార్యక్రమంలో జడ్పీటీసి బల్లాడ హేమమాలిని, ఎంఈఓ కారు పున్నయ్య, మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి సుధాకర్, ఎంపీటీసీ జి.నర్సింగరావు, ఏం ఎస్ ఓ సాధు శ్రీనివాసరావు, పీఈటి పీడీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవి రమణ తదితరులు పాల్గొన్నారు. జూనియర్ విభాగంలో కబడ్డీలో విన్నర్స్‌గా ధర్మవరం రన్నర్‌గా కేశవరావుపేట ఖోఖోలో కుప్పిలి, ధర్మవరం వాలీబాల్‌లో కేశవరావుపేట, కొత్తపేట జట్లు విజేతలుగా నిలిచారు. సీనియర్స్ విభాగంలో కేశవరావుపేట కొత్తపేట, ఖోఖోలో కుప్పిలి, అల్లినగరం వాలీబాల్‌లో కొత్తపేట, కేశవరావుపేట జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాలను దక్కించుకున్నారు. ఇదే క్రీడాంశంలో బాలురకు బుధవారం పోటీలు నిర్వహిస్తారు.

రాజకీయాలకతీతంగా పాలన : ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర-జలుమూరు: రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి ఆదరించాలని మాజీ డిప్యూటీ సీఎం, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ప్రజలను కోరారు. మండలంలోని లింగాలవలస గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు బుక్కా లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగింది. అంతకు ముందుగా అల్లాడ పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రంను నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పద్మప్రియ, అల్లాడ పీఏసీఎస్ అధ్యక్షులు పొన్నాడ మునలినాయుడుల ఆధ్వర్యంలో జరిపారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నుంచి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందిస్తున్నామని ఎమ్మెల్యే కృష్ణదాస్ తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ, వివిధ సంఘాల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా సమస్యలు పరిష్కారం

శాసనసభాపతి తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర-ఆమదాలవలస : భవిష్యత్తులో రాష్ట్రాన్ని సుస్థిరంగా సుభిక్షంగా ఉంచే శక్తి ఒక్క జగన్మోహన్‌రెడ్డికి మాత్రమే ఉందని శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. మంగళవారం ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్ళి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పథకాల లబ్ధిని, గత మూడేళ్లలో మండలంలో ప్రతి గ్రామంలో జరిగిన అభివృద్ధిని ప్రజానీకం ముందు ఉంచేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సీఎం రూపకల్పన చేశారన్నారు. గ్రామంలో ఎవరికైనా, ఎట్లాంటి సమస్యలు ఉన్నా వాటిని సంబంధిత అధికారుల ద్వారా తక్షణ పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పథకాల అమలులో మరింత సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించడమే లక్ష్యంగా 'గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో బొడ్డేపల్లి రమేష్ కుమార్, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, దుంపల శ్యామలరావు, ఎండా విశ్వనాథం, సనపల సురేష్,పొన్నాడ చిన్నారావు, కూన రామకృష్ణ, మామిడి రమేష్‌కుమార్ బి.కోటేశ్వరరావు కనక రాజు బొడ్డేపల్లి రమణ మూర్తి తదితర వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధికారులు సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

చిన్నారులకు అండగా పారా సంస్థ

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : మానవ హక్కు విద్యా బోధనలో భాగంగా 'పారా' సంస్థనియోజకవర్గ స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా పారా సంస్థ ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలలో 12జిల్లాల్లో 650 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మానవ హక్కుల విద్యా బోధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లాలో 5 మండలాలు శ్రీకాకుళం అర్బన్, శ్రీకాకుళం రూరల్, గార, రాజాం, సంతకవిటి 41 ఉన్నత పాఠశాలు, 41గ్రామ పంచాయతీల్లో బాలల సంరక్షణ కమిటీలను ఏర్పాటుచేసి బాలల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేయడం జరుగుతుందని హెచ్‌ఆర్‌ఈ పారా జిల్లా కోఆర్డినేటర్ సంపతి కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఆర్‌ఈ నియోజకవర్గ స్థాయి సమావేశానికి స్టేట్ లెవెల్ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. నేటి బాలలే రేపటి పౌరులుగా అన్న నినాదాన్ని నిజం చేస్తూ పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించి తీర్చిదిద్దడంలో పారా సంస్థ కీలకపాత్ర పోషిస్తుందని సంపతి కుమారి తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రొటెక్షన్ చైల్డ్ కమిషన్ మెంబర్ గొండు సీతారాం మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటు వేసుకోవడానికి సంస్థ వేదికగా ఉన్నందుకు అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీవో కె.రమణ, శ్రీలక్ష్మి, నర్సింహమూర్తి, సురేష్, జ్యోతి, గార ఎంఈవో జెజెబీ శ్రీనివాసరావు, బి. సంతోష్, కళ్యాణి, రామారావు తదితరులు ఉన్నారు.

కామ్రేడ్ బెండి ఆనందరావు మృతి

విశాలాంధ్ర-ఆముదాలవలస: కామ్రేడ్ బెండి ఆనందరావు బెలమాం గ్రామంలో మంగళవారం తుది శ్వాస విడిచారు. జిల్లాలో మొట్టమొదట రైతాంగ పోరాట ఉద్యమం, నక్సల బరి ఉద్యమంలో చాలాసార్లు జైలు జీవితం అనుభవించారు. బంధాలు బంధుత్వాల కంటే ఉద్యమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. చివరి వరకు కమ్యూనిస్టు భావాలతో మెలిగారు. నాటి కమ్యూనిస్టు ఉద్యమానికి నేటి కమ్యూనిస్టు ఉద్యమానికి ఎంతో తేడా ఉందంటూ పలు సందర్భాల్లో వాపోయారు. 20వ దశకంలో విశాలాంధ్ర విలేకరిగా పనిచేశారు. ఆనాడు పంచికట్లో ప్రెస్ మీట్ కు వచ్చిన విలేఖరి కామ్రేడ్ ఆనందరావు ఏకైక వ్యక్తి. 1967లో గిరిజన హక్కుల కోసం పోరాడుతున్న సమయంలో అప్పటి ప్రభుత్వం కనిపిస్తే కాల్చివేయాలని ఉత్తర్వులు జారీ చేయడంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆనాటి నగరికటకం నియోజక వర్గం శాసనసభ్యులు తమ్మినేని పాపారావు సారథ్యంలో ప్రభుత్వానికి లొంగి పోయారు. అప్పటినుండి జైలు జీవి తాన్ని కొంతకాలం గడిపారు. నాలుగేళ్ల జైలు జీవితం అనంతరం గ్రామానికి చేరుకుని ఉద్యమాల కోసమే మాట్లాడేవారు. ఆయన కుమారులు కూడా జీవన మార్గం అందించలేకపోయారు. మంగళ వారం మధ్యాహ్నం నాలుగు గంటలకు గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు నిర్ణయించారు. కామ్రేడ్ ఆనందరావు కమ్యూనిస్టు భావాలు కలిగిన వ్యక్తి మృతి చెందడంపై పలువురు నాయకులు పత్రికా విలేకరులు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

రాజధాని వికేంద్రీకరణకు తొలగిన అడ్డంకి

- ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి
- అమరావతి ఏకైక రాజధాని అనే నినాదానికి స్వస్తి పలకాలి
- ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: భారత రాజ్యాంగానికి ప్రధాన అంగాలైన శాసన వ్యవస్థ, కార్య నిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థలు సక్రమంగా పనిచేసిన నాడే దేశం పురోగతిలో పయనిస్తుందని శాసన సభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. చట్టాలు చేసే శాసన వ్యవస్థను, శాసించాలని చూడటం న్యాయవ్యవస్థకు సరికాదనే న్యాయ నిపుణుల అభిప్రాయాలను సుప్రీంకోర్ట్ గుర్తు చేయడం శుభపరిణామమని ఆయన అన్నారు. అమరావతి రాజధాని అంశంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం వెలుబుచ్చిన అభిప్రాయంపై సభాపతి హర్షం ప్రకటించారు. ఈమేరకు మంగళవారం రహదారులు భవనాలశాఖ అతిథి గృహంలో మీడియా సమావేశం నిర్వహించారు. చట్టాలు చేసే శాసన వ్యవస్థ చర్యలను తప్పు పట్టడం విషయంలో హైకోర్టు జోక్యం సరికాదని సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్య, న్యాయవ్యవస్థపై అచెంచలమైన విశ్వాసం కలిగిందన్నారు. సుప్రీం కోర్టు వ్యాఖ్యలను పౌర సమాజం ముక్త కంఠంతో స్వాగతిస్తుందన్నారు.6 నెలల్లో అమరావతి రాజధాని నిర్మించి తీరాల్సిందే అంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు సరికాదంటూ సుప్రీంకోర్టు పేర్కొనడం ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం విజయంగా ఆయన అభివర్ణించారు. రాజధాని, అభివృద్ధి వంటి అంశాలను నిర్ణయించే అధికారం చట్టసభలకు ఉంటాయని స్పీకర్ తమ్మినేని గుర్తు చేశారు. ఇప్పటికైనా రాజధాని వికేంద్రీకరణకు కట్టుబడి ఉన్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపక్ష పార్టీలు సహకరించాలని ఆయన సూచించారు. సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేన పార్టీల అభిప్రాయాలను తేటతెల్లం చేయాలని ఆయన కోరారు. ఆరు నెలల్లో ఇల్లు నిర్మించుకోవడమే సాధ్యం కాదన్నారు. ఈ నేపథ్యంలో కర్నూలులో న్యాయ రాజధాని,అమరావతిలో శాసన రాజధాని వంటివి ఏర్పాటు జరగడం ద్వారా రాష్ట్రం అభివృద్ధి బాట పట్టడం ఖాయమన్నారు. కేశవానంద భారతి వంటి కేసుల్లో దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన పలు తీర్పులు పలు వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపిందన్నారు. ముఖ్యమంత్రి ఆశయాలు,అభివృద్ధి కోరుకునే వారి ఆలోచనలు త్వరలో సాకారం కానుందన్నారు.

పరివర్తనతో జీవితాల్లో వెలుగులు రావాలి : కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జిల్లాలో పరివర్తన 2.0 క్రింద ఆర్థిక సహాయం పొందుతున్న 34 కుటుంబాల జీవితాల్లో వెలుగులు రావాలని ఆకాంక్షిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ పేర్కొన్నారు. చట్ట విరుద్ధ కార్యకలాపాలు చేస్తూ అబ్కారీ శాఖకు పట్టుబడిన వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి క్రింద ఆర్థిక సహాయం అందించే కార్యక్రమం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పోలీసు శాఖ, డి.ఆర్.డి.ఎ,స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జి.ఆర్.రాధిక, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డా.డి.వి. విద్యాసాగర్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.వరప్రసాద్ కలిసి 34 కుటుంబాలకు రూ. 11 లక్షల నమూనా చెక్కును అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డి.ఆర్.డి.ఎ సహకారంతో పాత అబ్కారి నేరస్తులకు ప్రత్యామ్నాయ జీవనోపాధిని పరివర్తన 2.0 పేరుతో ఆర్థిక సహాయం పొందుతున్న కుటుంబాల్లో కొత్త వెలుగులు రావాలని, నీతి, నిజాయితీలతో జీవనం సాగించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ మేనేజర్ బి.కె.వి. ఎస్.ఎస్.గురునాధరావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జి.వి.బి.డి. హరిప్రసాద్,ఆర్.బి.ఐ ఎల్.డి.ఓ ఎస్.అనిల్ కుమార్, నాబార్డ్ డిడిఎం వరప్రసాద్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడేతత్వం హారికాప్రసాద్

- హారికా కన్‌స్ట్రక్షన్స్ అండ్ కన్సల్టింగ్ 13వ వార్షికోత్సవంలో
- రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : తాను ఎంచుకున్న రంగంలో చిత్తశుద్ధితో కృషిచేసి ఉన్నతస్థాయికి ఎదిగిన మనస్తత్వం హారికాప్రసాద్‌ది అని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని సానావీధిలోని గాంధీనగర్ లోని హారికా కన్‌స్ట్రక్షన్స్ అండ్ కన్సల్టింగ్ 13వ వార్షికోత్సవం వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్‌చేసి హారికాప్రసాద్ కుటుంబ సభ్యులకు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ ఏ వృత్తిలోనైనా పట్టుదలతో క్రమశిక్షణగా ప్రయత్నిస్తే ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతామని తెలిపారు. అలాంటివారి కోవకే హారికాప్రసాద్ చెందుతారన్నారు. ఈ 13ఏళ్లలో ఎన్నో ఒడిదుడుకులు వచ్చినా నిజాయితీగా నిర్మాణదారుల నమ్మకాన్ని చూరగొనడంవల్లే హారికా కన్‌స్ట్రక్షన్స్ అండ్ కన్సల్టింగ్ సంస్థ గొప్పగా ఉత్తరాంధ్రలోనే ఖ్యాతిలోనే ఖ్యాతి పొందిందన్నారు. శ్రీకాకుళం నగరంలో సర్క్యులేషన్ పాట్రన్ గురించి ఆలోచించాలని హారికా ప్రసాద్ మంత్రి ధర్మానను కోరారు. వెంటనే మంత్రి స్పందించి సంబంధిత శాఖా డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. త్వరలోనే దీనిపై చర్చించి శ్రీకాకుళం నగరంలోని సర్క్యులేషన్ పాట్రన్ అమలయ్యేలా చూస్తానని మంత్రి హామీనిచ్చారు. ఇప్పటికే 17 ప్రాంతాల్లో సర్క్యులేషన్ పాట్రన్ అమలయ్యేలా నివేదికను సిద్ధం చేసినట్టు వివరించారు. భవిష్యత్‌లో హారికా కన్‌స్ట్రక్షన్స్ అండ్ కన్సల్టింగ్ సంస్థ మరింత ఉన్నతస్థాయికి చేరుకోవాలని ధర్మాన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.వి పద్మావతి వైసీపీ యువతనేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, ఎం.వి స్వరూప్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్‌మోహనరావు, సురంగి మోహనరావు, గుల్‌నా, మండవిల్లి రవి, కాపవరపు సీతు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు నటుకుల మోహన్, బాదాన దేవభూషణరావు, వావిలాపల్లి జగన్నాధరావు, పొన్నాడ రవికుమార్, కరణం శోభారాణి, కరణం హారికా, సంస్థ సిబ్బంది, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వ నిధులతో రహదారుల అభివృద్ధి

జెడ్పీటీసి డా.ధర్మాన కృష్ణ చైతన్య

విశాలాంధ్ర-నరసన్నపేట : ముఖ్యమంత్రి, వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సచివాలయాలకు రూ.20లక్షలు చొప్పున నిధులు కేటాయించారని పోలాకి జెడ్పీటీసి, వైసిపి నియోజకవర్గ యువ నాయకులు, డా.ధర్మాన కృష్ణ చైతన్య అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని మారుతీనగర్-1వ వీధిలో, వంశధార నగర్‌లో సుమారు రూ.8లక్షలుతో సిమ్మెంటు రహదారుల నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డా.చైతన్య మాట్లాడుతూ సంక్షేమం-అభివృద్ధిలో భాగంగా నియోజకవర్గం లోని పలు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా సిసి రహదారుల నిర్మాణానికి నిధులు వినియోగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి, ఆరంగి మురళీధర్, పంచాయితీ సర్పంచ్, బురల్లి శంకరరావు, వైస్ సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు, గొట్టిపల్లి సర్పంచ్, అవ్వ రవీంద్రరెడ్డి, వైసిపి నాయకులు, కెసిహెచ్‌టి.గుప్తా, రఘుపాత్రుని శ్రీధర్, గనగళ్ళ వేంకట శ్రీనివాసరావు, పొట్నూరు కృష్ణప్రసాద్, వైశ్యరాజు కేశవరాజు, పొట్నూరు సాయిప్రసాద్, సదాశివుని కృష్ణ, రమణ సాహు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని జేసీ నవీన్ కుమార్ తనిఖీ

విశాలాంధ్ర-కొత్తూరు: మండలం ఒండ్రుజోల సచివాలయాన్ని జాయింట్ కలెక్టర్ నవిన్ కుమార్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయ రికార్డులను పరిశీలించారు. రానున్న సీజన్ ధాన్యం కొనుగోలు, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి తీసుకునే చర్యలు ఇకెవైసి తదితర అంశాలపై సిబ్బందికి తగు సూచనలు చేశారు. జేసీ తనిఖీ సమయంలో కార్యదర్శి ఢిల్లీశ్వరరావు, సిబ్బంది విధుల్లో ఉన్నారు. కాగా అంతకు ముందు ఒండ్రుజోల పంచాయతీ పరిధిలో కొత్తగా మంజూరైన పెట్రోల్ బంక్‌కు సంబంధించి స్థలాన్ని పరిశీలించారు. జేసీ వెంట తహశీల్దార్ బాల ఉన్నారు.

రాజ్యాంగ ఉన్నతిని కాపాడాలి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : ప్రపంచ దేశాలకు ఆదర్శవంతమైన రాజ్యాంగ వ్యవస్థను కల్గిన భారతదేశంలో పౌరులకు తగిన హక్కులతోపాటు విధులను కూడా కల్పించడం జరిగిందని జూనియర్ సివిల్ జడ్జి మండల న్యాయసేవా సంస్థ ఛైర్మన్ పి.రవిశంకర్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సురంగి రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన మాక్ అసెంబ్లీకి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో హుందాగా వివిధ ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ అసెంబ్లీ సమావేశాల మాదిరి నిర్వహించిన తీరును అభినందించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను అనుభవించే క్రమంలో విధులను నిర్వర్తించడం, ప్రపంచ దేశాల్లో భారత రాజ్యాంగం పట్ల గౌరవం ఇనుమడింపజేసేలా నడుచుకుంటూ ఉన్నతిని కాపాడుకోవడం ప్రతీఒక్కరి బాధ్యత అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.వి.త్రినాధరావు అధ్యక్షతన సాంఘీక శాస్త్ర అధ్యాపకులు వాసుదేవరావు పర్యవేక్షణలో జరిగిన ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి కె. అప్పారావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గిన్ని సీతయ్య, నాగరాజ్ పాత్రో, సభ్యులు ఎస్.ఎల్ నారాయణ, ఎన్.రమణయ్య, రోటరీ గవర్నర్ డి. క్రిష్ణమూర్తి, పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన సిక్కోలు బాడీ బిల్డర్స్

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : ఈనెల 27 ఇచ్ఛాపురంలో జరిగిన మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ కాంపిటీషన్‌లో సిక్కోలు బాడీ బిల్డర్స్ సత్తాచాటారు. అరుగుల జ్యోతి కుమార్ 55కెజీల విభాగంలో ప్రథమ స్థానం, అరుగుల సంతోష్ కుమార్ 60 కెజీల విభాగంలో ప్రథమ స్థానం, కె శంకర్ యాదవ్ మెన్స్ ఫిజిక్ విభాగంలో మూడవ స్థానం, కొయ్యాన గౌరీ శంకర్ 65 కెజీల విభాగంలో రెండవ స్థానం, చింతాడ వెంకటేష్ 85కెజీల విభాగంలో నాలుగవ స్థానం, ఎస్.కె అబ్దుల్ ఖాన్ మాస్టర్స్ విభాగంలో ప్రథమ స్థానం, మాస్టర్స్ విభాగంలో హెూంగార్డ్ సోమశేఖర్ నాలుగవ స్థానం సాధించాంచారు. వారిని శ్రీకాకుళం బాడీ బిల్డర్స్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ వి విజయ్ కుమార్, బి ప్రసాద్ లు అభినందనలు తెలిపారు. వారితోపాటు వైయస్సార్ సీపీ నాయకులు సుంకర కృష్ణ కుమార్, శిమ్మ రాజశేఖర్, ఫిట్నెస్ అధినేత గోపాల్, సర్కిల్ ఇన్స్‌పెక్టర్ అంబేద్కర్, ముద్దాడ అప్పారావు, సాగి శ్రీనివాసరాజు, సీనియర్ బాడీ బిల్డర్ సూరిబాబు. ఆర్టీసీ నాగు, జిమ్ కోచ్ శ్రీను, జిల్లా టీం మేనేజర్ కె.గౌరీశంకర్ (ఆమదాలవలస) అభినందనలు తెలిపారు.

చంద్రబాబును కలిసిన మాజీ ఎమ్మెల్యే కలమట కుటుంబం

విశాలాంధ్ర-కొత్తూరు : హైదరాబాద్‌లో గల తెలుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు నివాసంలో ఆయనతో పాతపట్నం నియోజకవర్గం ఆ పార్టీ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కలమట వేంకట రమణ మూర్తి కుటుంబ సభ్యులు భార్య ఇందిరా, కుమారుడు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్, కోడలు మాధురిలతోపాటు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసినట్లుగా ఇక్కడ మీడియా ప్రతినిధులకు ఫోన్‌లో తెలిపారు. తన తండ్రి సీనియర్ ఎమ్మెల్యే కలమట మోహన్‌రావుతోపాటు తమ కుటుంబం యోగక్షేమాలను బాబు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులు తెలుగుదేశం పార్టీ భవిష్యత్‌లో తీసుకొనే కార్యక్రమాలను, వైసీపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను గ్రామాల్లో పర్యటించి ప్రజలకు వివరించాలని ఈ సందర్భంగా పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారని మాజీ ఎమ్మెల్యే కలమట తెలిపారు.

సురక్షిత భవనాలకు కోర్టును తరలించాలి : రోడ్డెక్కిన న్యాయవాదులు

విశాలాంధ్ర-టెక్కలి : ప్రస్తుతం ఉన్న కోర్టు శిథిలావస్థలో ఉండడంతో విధులు నిర్వహించుటకు ఇబ్బందికరంగా ఉండటంతో, కోర్టు భవనాలు తమకు ప్రాణ సంకటంగా మారాయని సురక్షిత భవనాలు కేటాయించాలని కోరుతూ టెక్కలిలో మంగళవారం న్యాయవాదులు రోడ్డెక్కారు. ఈసందర్భంగా న్యాయబదులు మాట్లాడుతూ కోర్టు నుండి సురక్షిత భవనాలకు తరలించే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని అధికారులకు హెచ్చరించారు. గతంలో టెక్కలి ఆర్డిఓ కార్యాలయం దగ్గరలో ఉన్న కోర్టు శాశ్వత భవనాలు పెచ్చులూడి పలు సందర్భాల్లో న్యాయవాదులకు, కక్షిదారులకు గాయాలు కావడంతో కోర్టును తాత్కాలికంగా పాత ఎంపీడీవో కార్యాలయానికి తరలించారని, అయితే ఆ భవనం కూడా పాతది కావడంతో స్లాబ్ పెచ్చులూడి వర్షానికి కారుతుండడంతో సురక్షిత భవనాన్ని మంజూరు చేయవలసిందిగా రాష్ట్ర హైకోర్టుకు విజ్ఞాపన చేయడంతో సానుకూలంగా స్పందించిన రాష్ట్ర హైకోర్టు మా విజ్ఞాపన్ను అంగీకరించిందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లగా పాత ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ఒక భాగమైన ప్రసూత వార్డును కోర్టు భవనానికి వాడుకోమని పాక్షిక మరమ్మత్తులు కోసం నిధులు కూడా కేటాయించినట్లు తెలిపారు. అయితే తమకు ప్రభుత్వం నుండి అధికారికంగా ఉత్తర్వులు అందకపోవడంతో విధులు బహిష్కరించి రిలే నిరాహార దీక్షలు చేపట్టినట్లు న్యాయవాదుల అధ్యక్షులు సంజీవి ధర్మారావు, సెక్రటరీ సంపతి రావు సూర్యరాజు, ఉపాధ్యక్షులు దాడి ధర్మారావు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు ఈశ్వరరావు,పేడాడ బాబురావు, దువల రాజేశ్వరరావు, బాలకృష్ణ, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ ధ్యేయంగా పనిచేయాలి

- అంగన్వాడీలు ఆదర్శంగా ఉండాలి
- రవీంద్ర భారతి అనుమతుల రద్దుకు సిఫారసు
- బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర సభ్యులు

విశాలాంధ్ర-ఆముదాలవలస బాలల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా మనమంతా పనిచేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. మంగళవారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో అంతర్జాతీయ దత్తత మాసోత్సవాలు సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త ఆదర్శవంతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇది నిర్వహణలో తప్పిదాలను సమర్ధించుకోవడం సరికాదని జవాబు దారి తనంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం అందించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి వ్యవస్థను కూడా మెరుగుదిద్దాలన్నారు. పౌష్టికాహార లోపంతో ఏఒక్కరూ మృతిచెందరాదని తెలిపారు. 1975లో ఏర్పడ్డ స్త్రీ శిశు సంక్షేమ మహిళా శాఖ అంచెలంచెలుగా ఎదిగి నేడు పరివర్తన చెందిన సంస్థగా ఏర్పడిందన్నారు. అందుకు అందరి సహకారం లభించిందని తెలిపారు. జిల్లాలో కార్యకర్తల పైన ఆధారాలతో అనేక ఫిర్యాదులు వచ్చాయని ముందు ముందు వాటి శాతాన్ని తగ్గించుకునే విధంగా కేంద్రాల వద్ద మంచితనంతో పనిచేయాలని తెలిపారు. హేము యాక్ట్ ప్రకారం దత్తత తీసుకోవడం నేరంకాదని అందుకు తగిన అనుమతులను పొందవలసి ఉంటుందని వివరించారు. బాల్య వివాహాలు జరగకుండా ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. ముందుగా పట్టణంలోని రవీంద్ర భారతి పాఠశాలను పరిశీలించారు.

- పాఠశాల అనుమతులు రద్దుకు సిఫారసు...

రవీంద్ర భారతి పాఠశాల యాజమాన్య వ్యవహార శైలి సక్రంగా లేదని, కనీస మౌలిక వసతులు విద్యార్థులకు ఏర్పాటు చేయడంలో యాజమాన్యం వైఫల్యం చెందిందని బంధనలు మేర పాఠశాల రద్దుకు ఫారెస్ట్ చేయనున్నామని కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. నెలలోగా అన్ని రికార్డులతో కమిషన్ ముందు హాజరుకావాలని లేకుంటే క్రిమినల్ చర్యలకు సిఫారసు చేస్తామన్నారు. వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆట స్థలం లేదని పాఠశాలకు అనుమతులు కూడా గత నెలతో పూర్తయ్యాయని కనీస మౌలిక వసతులు ఏర్పాటు చేయకుండా పాఠశాల నిర్వహణ ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. సేఫ్టీ భద్రత లేనందున ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం 30 మందికి ఒక వాష్ రూమ్ ఉండవలసి ఉండగా అటువంటి టాయిలెట్లు ఎక్కడ కనిపించలేదు అన్నారు. అర్హత కల ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని ప్రశ్నించగా ఆ సమాచారము వివరించక యాజమాన్యం తెల్ల ముఖం వేసింది. యాజమాన్యం ఏదో ప్రత్యేక వేదనలో ఉన్నట్టు తెలుస్తుందని దీనిపై సమగ్ర సమాచారాన్ని కమిషన్కు వివరిస్తామన్నారు. ఆయనతో పాటు వాకముల వెంకటరమణ గన్నవ్వుడు, సీఆర్పీఎఫ్ కమిషనర్ శ్రీనివాసరావు, కెవి రమణ, ఐసిడిఎస్ పిడి అనంతలక్ష్మి, పిఓ బాలామణి, టీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనురాధ, ఎంఈఓ దువ్వల రామారావు, అంగన్వాడీ కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

జోన్ స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-కవిటి : మండలం నుండి వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులు వాలీబాల్, కబడ్డీ, కోకో పోటీలకు ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారి ధనుంజయం మజ్జి తెలిపారు. జూనియర్ కబాడీ బాలుర విభాగంలో జడ్పీహెచ్‌ఎస్ ఇద్దివాని పాలెం, బోరివంక జడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థులు, సీనియర్ కబాడీ బాలురు విభాగంలో జిహెచ్ఎస్ కవిటి, జడ్.పి.హెచ్.ఎస్ రాజపురం విద్యార్థులు, జూనియర్ కబాడీ బాలికలు విభాగంలో ఇద్దువానిపాలెం జడ్పీహెచ్ఎస్,పాత కట్టీరియా జడ్పీహెచ్ఎస్ విద్యార్థినిలు, సీనియర్ కబాడీ బాలికలు విభాగంలో ముత్యాల పేట జడ్పీహెచ్ఎస్, బోరి వంక జడ్‌పి హెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు, జూనియర్ ఖోఖో బాలురు విభాగంలో రాజపురం జడ్పీ హెచ్ఎస్, బోరివంక జడ్.పి. హెచ్.ఎస్ విద్యార్థులు, సీనియర్ కోకో బాలురు విభాగంలో కవిటి జడ్పీ హెచ్ఎస్, రాజపురం జడ్పీ హెచ్ఎస్ విద్యార్థులు, జూనియర్ కోకో బాలికలు విభాగంలో కవిటి జి హెచ్ ఎస్, సిలగాం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు, సీనియర్ కోకో బాలికల విభాగంలో కవిటి జిహెచ్ఎస్, బోరివంక జడ్పీహెచ్ఎస్ పాఠశాల చెందిన విద్యార్థులు కవిటి మండలం నుండి జోనల్‌స్థాయి అంతర పాఠశాలల పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు.

అక్రమ అరెస్టులను ఖండించిన ఆనెపు

విశాలాంధ్ర-బూర్జ: తిరుపతిలో గురువారం ప్రారంభించిన "గ్రామాల అభివృద్ధికై సర్పంచ్‌ల సమర శంఖారావం" కార్యక్రమానికి హాజరు కాకుండా సర్పంచ్‌ల ను నిర్బంధించ డాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పంచాయితీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షుడు ఆనెపు రామకృష్ణంనాయుడు అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా తమ హక్కులకై పోరాటం చేస్తున్న కొందరి సర్పంచ్ లను అరెస్టు చెయ్యడం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నియంతృత్వ పాలనకు నిదర్శనమని ఆనరవు మండి పడ్డారు. తిరుపతిలో పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్?, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మి ఇతర నేతలని అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఏపీ సర్కారు ఖజానాకి మళ్లించిన రూ.8660 కోట్ల ఆర్థిక సంఘం నిధులు తిరిగి సర్పంచుల పీఎఫ్ఎంఎస్ ఖాతాల్లో జమ చెయ్యాలని, గ్రామ సచివాలయాలను సర్పంచ్‌ల అధ్వర్యంలోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. సర్పంచులు-ఎంపీటీసీ లకు రూ.15వేలు, ఎంపీపీలు-జడ్పీటీసిలకు రూ.30వేలు గౌరవ వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. నరిగా నిధులు కూడా గతంలో మాదిరిగా సర్పంచులకు ఇవ్వాలని, పాత పద్ధతిలోనే పంచాయతీ లకు ఉచిత విద్యుత్ ఇవ్వాలనే న్యాయమైన డిమాండ్లు సాధనకి తలపెట్టిన సర్పంచుల శంఖారావాన్ని ఉక్కుపాదంతో అణిచివేసిన సర్కారుకు పతనం తప్పదని హెచ్చరించారు. నిధులు, రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న అరాచక పాలనకు త్వరలోనే ప్రజలు బుద్ధి చెబుతారని ఈసందర్భంగా ఆనెపు రామకృష్ణం నాయుడు తెలియజేశారు.

ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

శాసనసభ్యులు డాక్టర్ అశోక్

విశాలాంధ్ర-కవిటి : ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపరచాలని ఇచ్ఛాపురం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ బి.అశోక్ అన్నారు. ఈమేరకు మంగళవారం మండలంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ రామయ్య పుట్టుగలో ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని కవిటి, సోంపేట, కంచిలి ఇచ్ఛాపురం మండలాల క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జి, బిఎల్‌వల శిక్షణ శిబిరంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో నాలుగు మండలాలు తెదేపా ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బంగారం షాపులో చోరీ

220గ్రాముల బంగారం, 25 కేజీల వెండి అపహరణ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : కోటబొమ్మాళి మండల కేంద్రం మెయిన్‌రోడ్డు స్వామి వారి సందులో ఉన్న తంగుడు నాగభూషణంకు చెందిన బంగారం షాపులో సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తు తెలియని వ్యక్తులు షాపు తాళాలు కోసి షాపులో చోరవడి 220 గ్రాముల బంగారం, 25 కేజీల వెండి అపహరించుకుపోయారని షాపు యజమాని తంగుడు నాగభూషణ్ మంగళవారం పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే షాపు యజమాని నాగభూషణం మంగళవారం ఉదయం 9 గంటలకు షాపు తెరిచేందుకు షాపువద్దకు రాగా అప్పటికే షాపు తాళాలు కోసి ఉండటం చూసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఈ మేరకు సంఘటన స్థలానికి టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి, స్థానిక ఎస్ఐ షేక్‌ఖాదర్‌భాషా, సంతబొమ్మాళి ఎస్ఐ మదుసూదనరావులు చేరుకొని క్లూస్‌టీం, డాగ్ క్వాడ్‌ను రప్పించి సోదాలు నిర్వహించగా డాగ్ స్క్వాడ్ ఘటనాస్థలం నుంచి వైశ్యవీధిగుండా దొంగలు వెళ్ళినట్లు సూచించింది. షాపుకు షట్టర్ లేకుండా చెక్క తలుపులు అమర్చి ఉండటం, సీసీ కెమెరాలు లేకపోవడం, వీధిలో ఉన్న షాపులకు సీసీ కెమెరాలు ఉన్నప్పటికి అవి పనిచేయకపోవడం వల్ల దొంగలకు ఇదీ సులభతరమైందన్నారు. ఈ మేరకు పోలీసులు కొంతమందిని అనుమానితులను తెచ్చి విచారించటం జరుగుతుందని సిఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి తెలిపారు.

తాగునీటి కుళాయిలకు ప్రారంభించిన సర్పంచ్

విశాలాంధ్ర-కంచిలి : తల తంపర గ్రామంలోని మండపం వీధి, కిల్లా వీధుల్లో మంగళవారం ఇంటింటికి కొలాయిలను సర్పంచ్ డాక్టర్ జగబంధు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ సురక్షితమైన తాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఇంటింటికి కులాయి పనులు త్వరితగతిన పూర్తి చేస్తున్నామన్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో పనులు పూర్తి చేసామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బృందావన్ సాహూ, గ్రామ పెద్దలు కుర్రా, మోహన్ మజ్జి తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలి

వైసీపీ జిల్లా అధ్యక్షులు ధర్మాన, మంత్రి డా.సీదిరి పిలుపు

విశాలాంధ్ర-పలాస : సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసీపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు ధర్మాన క్రిష్ణదాస్, రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజులు పిలుపునిచ్చారు. మంగళవారం జీఎంఆర్‌లో నూతనంగా నిర్మించిన ప్రగతిభవన్ (వైసీపీ కార్యాలయం)ను క్రిష్ణదాస్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి డాక్టర్ సీదిరి మాట్లాడుతూ ప్రగతి భవన్ నియోజకవర్గ ప్రజల కోసం, కార్యకర్తల కోసం 24 గంటలు తెరిచే ఉంటుందన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడిందని అన్నారు. రాజకీయాలకు అతీతంగా, వర్గాలకు అతీతంగా వందకు వందశాతం అందరికి అందివ్వాలనే లక్ష్యమే నవరత్నాల పథకమని అన్నారు. అయితే ప్రజాప్రతినిధుల్లో తమ చేతుల మీదుగా ఈ పథకాలు అందివ్వడం లేదనే నిరుత్సాహం ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు కార్యకర్తలు సమైక్యంగా సమిష్టిగా పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని, ఎటువంటి ఒడుదుడుకులు, ఇబ్బందులు వచ్చినా వెనుకడుగు వేయవద్దని అన్నారు. మనది సుదీర్ఘమైన ప్రయాణమని అన్నారు. ఈ రోజు అనుకున్నవి జరగకపోయినా మరో రోజు తప్పకుండా జరుగుతాయని నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని అన్నారు. నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటికి లక్షలాది రూపాయలు అందజేశామని, పండు ముసలి వాళ్లు కూడా జగన్మోహనరెడ్డిని చూడాలని తహతహలాడుతున్నారని అన్నారు. పలాస నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, పలాసలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నికల్ కళాశాల ఏర్పాటు, 200 పడకల ప్రభుత్వాసుపత్రితో పాటు కిడ్నీ పరిశోధన కేంద్రం నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. ఎక్కడ ఏం జరిగినా తనపైనే నిందవేస్తున్నారని, ప్రజలు అభిమానం, అండ ఉంటే వెంట్రుక కూడా తీయలేరని అన్నారు. తాను పుట్టి పెరిగింది సముద్ర తీరమని, సముద్ర అలలు వలే పడి లేస్తుంటానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ పిరియా విజయ, సాయిరాజ్, పలాస కాశీబుగ్గ మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ కోత పూర్ణచంద్రరావు, పలాస ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ భవానీశంకర్, పలాస మున్సిపల్ వైస్‌ఛైర్మన్లు బోర క్రిష్ణారావు, మీసాల సురేష్, పలాస, వజ్రపుకొత్తూరు, మందస ఎంపిపిలు ఉంగ ప్రవీణ, ఉప్పరపల్లి నీలవేణి ఉదయ్‌కుమార్, డొక్కరి దానయ్య, ఇరిగేషన్ డైరెక్టర్ మల్లా రవిలు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

విశాలాంధ్ర-సోంపేట : విద్యార్థి దశలో చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో కీలకమైనవని ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు అన్నారు. క్రీడల్లో రాణింపు ద్వారా ఉజ్వల భవిష్యత్తు పొందవచ్చని అన్నారు. స్థానిక జెడ్పీటిసి తడక యశోద, స్థానిక సర్పంచ్ ఎర్ర రజనీకుమారి, సోంపేట సర్పంచ్ నగిరి ప్రభావతమ్మలతో కలిసి బారువ డిగ్రీ కళాశాల ఆవరణలో మంగళవారం మండలస్థాయి గ్రిగ్స్ కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం గ్రామస్థాయి నుంచి కృషి చేస్తుందని అన్నారు. విద్యార్థులు కృషి, పట్టుదలతో మంచిగా రాణించి క్రీడల్లో మంచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి గుర్రాల శ్రీను, బుజ్జి, ఈశ్వరరావు, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ సలీంబాషా, తడక జోగారావు, వైస్ సర్పంచ్ రాజు, భువనేశ్వర పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో మెరిసిన సిక్కోలు చేతన ప్రియ

విశాలాంధ్ర-అరసవల్లి: ఆజాదీ కా అమ్రుత్ మహోత్సవ్‌లో భాగంగా, బెంగులూరు వారు నిర్వహించిన "జాన్ క్రితి 2022" జాతీయస్థాయి కూచిపూడి విభాగం (8-12సం.)లో జాతీయ స్థాయి పోటీలలో కొమ్ము చేతనప్రియ ప్రథమ స్థానం సాధించిందని నగరంలోని శివశ్రీ నృత్య కళానికేతన్ డైరెక్టర్ డా.శ్రీకాంత్ రఘుపాత్రుని తెలియజేశారు. ఆగస్టులో ప్రారంభమైన ఈ పోటీలకు 5వేల పైబడి పోటీ పడగా అందులో ఏడుగురిని ఫైనల్‌కి ఎంపిక చేశారని, ఆ ఏడుగురులో ఇద్దరు "శివశ్రీ నృత్య కళానికేతన్- శ్రీకాకుళం" నుంచి కొమ్ము మోహిత్ కుమార్, కొమ్ము చేతన ప్రియ అని తెలిపారు. వీరికి ఫైనల్ పద్మభూషణ్ అవార్డు గ్రహీత పద్మా శుబ్రహ్మణ్యం, నాట్యం మూవీ హీరోయిన్ సంధ్యారాణి, వనజా ఉదయ్ వంటి న్యాయ నిర్ణేతల సమక్షంలో నవంబరు 3వ తేదీన వెబ్‌నార్ ద్వారా ఫైనల్ నిర్వహించడం జరిగిందని, ఈఫైనల్‌లో కొమ్ము చేతనప్రియ జాతీయస్థాయి విన్నర్‌గా ప్రకటించారని తెలిపారు. ఈమెకు బెంగుళూరులో గల "వేద విజ్ఞాన్ మహా విద్యాపీఠ్" నందు భారత సాంస్కృతిక శాఖామంత్రి గురుదేవ్ శంకర్ చేతులమీదుగా తేది 26, 27, 28 జనవరి 2023 తేదీలలో అవార్డ్, సర్టిఫికేట్ అందజేస్తారని తెలిపారు.

కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేయాలి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : తెలుగుదేశం పార్టీ కార్యకర్తలంతా పార్టీ విజయం కోసం కలిసికట్టుగా పనిచేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి శాసనసభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. తమ నాయకుడు అచ్చెన్నాయుడు నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో ఉన్నారన్న సమాచారం తెలుసుకున్న కార్యకర్తలు, నాయకులు జిల్లా నలుమూలలనుంచి మంగళవారం నిమ్మాడ చేరుకొని ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో తెలుగుదేశం కార్యకర్తలు చిన్నచిన్న విభేదాలతో విడిపోయి పనిచేయటం వల్ల పార్టీ నష్టపోతుందని, ఏదైన సమస్య ఉంటే తనకు తెలియజేస్తే ఆ సమస్య పరిష్కరిస్తానన్నారు. అలకాకుండా విడిపోవడం వల్ల పక్క పార్టీ లాభపడుతుందని అందుకే అందరు కలిసి కట్టుగా పనిచేసి పార్టీ విజయం కోసం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హరిశ్చంద్రపురం టీడీపీ నాయకులు హనుమంతు అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి రైతుభరోసా కేంద్రం 1,2 పరిధిలో ఉన్న రైతులకు, సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు సర్పంచ్ కలింగపట్నం లక్ష్మి చేతులమీదుగా రైతులకు మంగళవారం పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వైస్ సర్పంచ్ ప్రతినిధి అట్టాడ రమణ, ఎంపీటీసీ 2 ప్రతినిధి శిమ్మ సోమేశ్వరరావురావు, వైస్సార్సీపీ నాయకులు డాక్టర్ కలింగపట్నం అప్పారావు, గ్రామ వ్యవసాయ సహాయకులు సాయి కిషోర్, సాయిరాజ్ ,గ్రామ సచివాలయము వాలంటీర్‌లు గున్న దినేష్, రైతులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సబ్సిడీ పై మేలైన విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా తమకు అందిస్తున్నందుకు రైతులు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారని సర్పంచ్ తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో జిల్లాకు పతకాలు

విశాలాంధ్ర-ఆముదాలవలస : ఇటీవల గుంటూరులో జరిగిన జూనియర్, సీనియర్, బాలికలు, పురుషుల విభాగాలలో ఆముదాలవలస మారుతి వ్యాయామ మండలిలో ఇటీవల రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు పలు విభాగాల్లో పతకాలు సాధించారు. 26 నుంచి 28 వరకు జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మహేష్ జూనియర్, సీనియర్ విభాగాల్లో బ్రాంచ్ మెడల్ సాధించారు. క్లీన్ అండ్ జరుకులో కూడా ఈయన ప్రతిభ కనబరిచారు. టీ వర్షిత సీనియర్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. జూనియర్ విభాగంలో సిల్వర్ పతకం సాధించి, క్లీన్ అండ్ జర్క్ లో 154 కేజీల విభాగంలో సిల్వర్ సాధించారు. టీ కావ్య యూత్ విభాగంలో బ్రాంచ్ మెడల్ సాధించారు. ఎం లలిత క్లీన్ అండ్ జర్క్ సీనియర్ విభాగంలో బంగారు పతకం సాధించి జిల్లాకు ఖ్యాతిని సంపాదించారు. కే వినోద్ యూత్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి కొత్తకోట శ్రీనివాసరావు, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఇంజరాపు భాస్కరరావు, కోచ్, టీం మేనేజర్ అప్పన్న క్రీడాకారులను అభినందించారు.

అగ్రి బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు

సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి

విశాలాంధ్ర-శ్రీకాకుళం కలెక్టరేట్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే అగ్రిగోల్డ్ బాధితులకు ఆరు నెలల్లో న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని, ఆ హామీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని, అగ్రిగోల్డ్ బాధితులందరికీ వారి డబ్బులు అందేలా ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి అన్నారు. చివరి బాధితునికి న్యాయం జరిగే వరకు అగ్రిగోల్డ్ పోరాటం ఆగదని అగ్రిగోల్డ్ కష్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు సీపీఐ అండగా ఉండి పోరాడుతుందన్నారు. "అగ్రి" అసోసియేషన్ పిలుపులో భాగంగా 30గంటల నిరాహార దీక్షల కార్యక్రమంలో సంఘీభావంగా జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తితోపాటు సీపీఐ నగర కార్యదర్శి డోల శంకరావు, ఏఐటీయుసీ గౌరవ సలహాదారు చిక్కాల గోవిందరావు, మహిళా సమాఖ్య నాయకురాలు పట్టా ప్రభావతిలు రెండవ రోజు మంగళవారం పాల్గొని నిరసన తెలిపారు. అనంతరం దీక్ష చేపట్టిన అసోసియేషన్ సభ్యులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ అగ్రిగోల్డ్ యాజమాన్యం ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అయినా ప్రతీ బాధితునికి వారి సొమ్ములు అందేలా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే ఎంతో మంది బాధితులు ఆందోళనకు గురైన బలవన్మరణానికి పాల్పడ్డారని, వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గోవిందరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జయసింహాలు, రాష్ట్ర మహిళా నాయకురాలు ఆరేళ్లమ్మ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా రూ.10వేలు లోపు డిపాజిట్ దారులకు పూర్తిగా డబ్బులు అందాయని, రూ.20వేలు డిపాజిట్ దారులకు చెల్లింపులు జరిగినప్పటికీ పూర్తిస్థాయిలో బాధితులకు అందలేదని మృతిచెందిన బాధిత కుటుంబాల్లో కొందరికే ఎక్స్‌గ్రేషియా ప్రకటించారని, బలవన్మరణానికి పాల్పడిన బాధితులందరికీ ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వం నిధులు విడుదల చేసి ప్రతీ డిపాజిట్‌దారుడికి డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని, చివరి బాధితునికి న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు గంగు శ్రీను, కోటేశ్వరరావు, ఎంహెచ్, తదితర సభ్యులు పాల్గొన్నారు.